# ఇంటింటా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

### మరింత అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా షకీల్‌ను గెలిపించాలి

రెంజల్, నవంబర్25: శనివారం బోధన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని కందకుర్తి గ్రామంలో సర్పంచ్ ఖలీంబేగ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్, ఎంపీటీసీ అసద్‌బేగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సాలూర మండలంలో..

బోధన్ రూరల్, నవంబర్ 25: అభివృద్ధి ముందుకు సాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌ను మళ్లీ గెలిపించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ అన్నారు. శనివారం సాలూరా మండలంలోని కుమ్మన్‌పల్లి, ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల్లో ఆయన షకీల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా షకీల్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నమూనా ఈవీఎంపై కారు గుర్తును చూపుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ గంగన్ ప్రభాకర్, మహబూబ్, మహేందర్‌రెడ్డి, ఆపుల భూమయ్య, వెంకట్‌రెడ్డి, అశ్వక్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



కుమ్మన్‌పల్లిలో నమూనా ఈవీఎంపై కారుగుర్తును చూపుతున్న నాయకులు



కందకుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు

నవీపేట, నవంబర్ 25: రైతులకు బీఆర్ఎస్ ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ రుణా మాఫీ చేసే క్రమంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నిలిపివేయించారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొక్కెర్ల నర్సింగ్‌రావు, సీనియర్ నాయకుడు తెడ్డు పోశెట్టి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు రూ.18 వేల కోట్ల నిధులను విడుదల చేసి, రుణ మాఫీ చేసే క్రమంలో ఆ రెండు పార్టీలు అడ్డుకున్నాయని పేర్కొన్నారు. రైతు బంధుపై కూడా ఫిర్యాదు చేయడంతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే ప్రక్రియను కొన్ని రోజులపాటు ఎన్నికల కమిషన్ నిలిపివేసిందని అన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడంతో రైతు బంధు పంపిణీ చేసేందుకు అనుమతి వచ్చిందని అన్నారు. దీంతో కాంగ్రెస్, బీజేపీలకు చెంప మీద కొట్టినట్లు అయ్యిందని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి రైతులకు రోజుకు మూడు గంటల కరెంట్ చాలని, 10 ఎచ్‌పీ మోటర్‌తో మూడు గంటల కరెంట్ సరఫరా చేస్తే సరిపోతుందని మాట్లాడడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దొంత ప్రవీణ్‌కుమార్, హరీశ్‌రావు, అల్లం రమేశ్, ఉప సర్పంచ్ కరిపె మల్లేశ్, లోకం నర్సయ్య, స్టేషన్ ఏరియా సర్పంచ్ షకీల్, అర్జున్, ఫకీరా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

### భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

శక్కర్‌నగర్, నవంబర్ 25: బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణేశ్‌శర్మ, మహేశ్ పాఠక్ వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్ (బుజ్జి) దంపతులతోపాటు పలు జంటలు హాజరయ్యాయి. కార్యక్రమాలను ఆలయ ఈవో శ్రీరాం రవీందర్‌గుప్తాతోపాటు జూనియర్ అసిస్టెంట్ రాములు పర్యవేక్షించారు. కార్యక్రమానికి ఆలయ సిబ్బంది సుధాకర్, కామన్న, సిబ్బంది సహకరించారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాలకు హాజరైన దంపతులు

## బీఆర్ఎస్‌లోకి గంగపుత్రులు



ఆయేషా ఫాతిమా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గంగపుత్రులు

రెంజల్, నవంబర్ 25: బోధన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా సమక్షంలో శనివారం మండల కేంద్రానికి చెందిన 100 మంది గంగపుత్రులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు, ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు తెలిపారు. వారికి ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు రఫీక్, ఖదీర్‌ఖాన్, మండల నాయకులు వినయ్, మహేందర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత రోడ్‌షోను విజయవంతం చేయాలి

నవీపేట, నవంబర్ 25: మండల కేంద్రంలో ఆదివారం (నేడు) ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్వహించనున్న ఎన్నికల రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొక్కెర్ల నర్సింగ్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా ప్రచారం చేసేందుకు ఎమ్మెల్సీ కవిత రోడ్‌షోకు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు. మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా కవిత రోడ్‌షో ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్ కుమార్, హరీశ్‌రావు, అల్లం రమేశ్, కరిపె మల్లేశ్, లోకం నర్సయ్య, షకీల్, అర్జున్, ఫకీరా తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ప్రశంసాపత్రం



సమ్మయ్యను సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వైజయంతి

శక్కర్‌నగర్, నవంబర్ 25: హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శనివారం బోధన్ అడిషనల్ సెషన్స్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలంగాణ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ వైజయంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. డీజీపీ కార్యాలయంలో న్యాయశాఖ ఆధ్వర్యంలో పోలీసుశాఖ సమన్వయంతో శనివారం నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సులో డాక్టర్ సమ్మయ్య 'వైట్ కాలర్ అఫెన్స్' అనే అంశంపై సుమారు రెండు గంటల పాటు విశదీకరించారు. న్యాయవ్యవస్థతో పోలీసుల భాగస్వామ్యం తదితర అంశాలపై డాక్టర్ సమ్మయ్య చేసిన అంశాలకు గాను ఆయనను తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అభినందించి, సత్కరించడంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సమ్మయ్యను నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య అభినందించారు.

# కుటుంబ కలహాలతో దాడి

### మామ, అల్లుడు మృతి

బిచ్కుంద, నవంబర్ 25: కుటుంబ కలహాలతో గొడవ పడగా.. ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని గుండెనెమ్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బిచ్కుంద ఎస్సై మురళి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుండెనెమ్లి గ్రామానికి చెందిన అరుణను శాంతాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలంగా అరుణ తల్లిగారి ఇంటి వద్దనే ఉంటున్నది. అరుణ భర్త సంతోష్ శుక్రవారం గుండెనెమ్లికి వచ్చి అరుణను తనతో పంపాలని మామ రాంబోయి(67)తో వాగ్వాదానికి దిగడంతో ఇద్దరు ఘర్షణ పడ్డారు. సంతోష్ తనతో తెచ్చుకున్న కర్రతో మామ తలపై కొట్టాడు. దీంతో అతడు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన రాంబోయి కుమారుడు సాయిలు, మనుమడు వేణు కలిసి సంతోష్(38)పై కర్రలు, రాళ్లతో దాడిచేశారు. దీంతో అతడు కూడా మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మురళి తెలిపారు.